ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

టీఎస్‌పీఎస్సీ
ఏఈఈ రాతపరీక్ష
ప్రశ్న పత్రాలు & 'కీ'లు

మాదిరి ప్రశ్నలు

✦ దాదాపు నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న 'మిసెస్ వరల్డ్' కిరీటాన్ని 2022 ఏడాదికి గాను ఎవరు దక్కించుకున్నారు?

జ: సర్గమ్ కౌశల్ (ఈమె జమ్ముకశ్మీర్‌కు చెందినవారు. 21 ఏళ్ల కిందట భారత్ నుంచి డాక్టర్ అదితి గోవిత్రికర్ ఈ కిరీటాన్ని అందుకున్నారు.)

కరెంట్ అఫైర్స్

✦ 2022 డిసెంబరులో కేంద్ర ప్రభుత్వం దేశంలో బొగ్గు గనుల వేలంపాటను ప్రారంభించింది. ఇలా బొగ్గు గనుల వేలంపాట నిర్వహించడం ఇది ఎన్నో సారి? (12 రాష్ట్రాల్లోని 133 బొగ్గు గనులను కేంద్రం ఈసారి వేలంపాటలో వేలానికి పెట్టింది. వీటిలో నాలుగు బొగ్గు గనులు తెలంగాణలో ఉన్నాయి.)

జ: ఆరోసారి

✦ 2032 సంవత్సరంలో జరగనున్న ఒలింపిక్స్‌కు ఏ నగరం ఆతిథ్యం ఇవ్వనుంది? (2024 ఒలింపిక్స్‌ను పారిస్‌లో, 2028 ఒలింపిక్స్‌ను లాస్ ఏంజెలెస్‌లో నిర్వహించనున్నారు)

జ: బ్రిస్బేన్, ఆస్ట్రేలియా

✦ కర్బన ఉద్గారాలను ఏ సంవత్సరం నాటికి సున్నా శాతానికి చేర్చాలని భారత ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది? జ: 2070

ఈ-బుక్స్

✦ జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలను ఎప్పుడు నిర్వహిస్తారు?

జ: డిసెంబరు 14 నుంచి 20 వరకు

టీఎస్‌పీఎస్సీ ఇండియన్ జాగ్రఫీ ఈ బుక్స్

వీడియో పాఠం
భారతదేశ చరిత్ర
ఈస్టిండియా కంపెనీ పాలనపై వ్యతిరేకత

శాశ్వతమే.. కానీ రద్దవుతుంది!

అది మేధావుల సభ. కళాకారులు గళం విప్పే వేదిక. అక్కడ జరిగే సమావేశాల్లో ఉపాధ్యాయులూ ఉత్సాహంగా పాల్గొంటారు. విధాన నిర్ణయాల్లో సామాజిక, ఆర్థిక, విజ్ఞాన, సేవారంగాల నిపుణులు భాగస్వాములవుతారు. శాసన ప్రక్రియలో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తారు. విభిన్న వర్గాల ప్రాతినిధ్యంతో విరాజిల్లే ఆ విశిష్ట మండలి ఉనికి శాశ్వతం. కానీ కావాలనుకున్నప్పుడు రద్దు చేసుకోవచ్చు. అవసరం అనుకుంటే పునరుద్ధరించుకోవచ్చు.

విధాన పరిషత్తు

రాష్ట్రస్థాయిలో అత్యున్నత శాసన నిర్మాణ వ్యవస్థ శాసన సభ. ఇందులో రెండు రకాల సభలు ఉంటాయి. మొదటిది ఎగువసభ. దీనినే విధాన పరిషత్తు అంటారు. రెండోది దిగువసభ, దానినే విధానసభగా వ్యవహరిస్తారు. కొన్ని రాష్ట్రాల్లో విధానపరిషత్తు ఉండదు. ఎగువ సభ బహుళ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే వ్యవస్థ. విధాన పరిషత్తును ఎగువ సభ, పెద్దల సభ, శాశ్వత సభ, శాసన మండలిగా కూడా పేర్కొంటారు. దీనిలో ఉండే సభ్యులను ఎమ్మెల్సీ (మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ కౌన్సిల్) అంటారు. 1950 నాటి భారత ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం విధాన పరిషత్తులో ఉండే కనీస ఎమ్మెల్సీల సంఖ్య 40. గరిష్ఠ ఎమ్మెల్సీల సంఖ్య విధానసభ సభ్యుల (ఎమ్మెల్యే) సంఖ్యలో 1/3వ వంతు మించకూడదు. ❐ భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం అప్పటి 11 రాష్ట్రాల శాసనసభల్లోని 6 రాష్ట్రాల శాసనసభల్లో 'ద్విసభా' విధానాన్ని అమలు చేసి ఎగువసభగా విధాన పరిషత్తును ఏర్పాటు చేశారు. ఆ ఆరు రాష్ట్రాల్లో మద్రాస్, బాంబే, అస్సాం, బెంగాల్, బిహార్, ఉత్తర్ ప్రదేశ్ ఉన్నాయి.

రాజ్యాంగ సభలో చర్చ

భారత రాజ్యాంగం
రాజకీయాలు

రాజ్యాంగాన్ని రూపొందించే క్రమంలో విధాన పరిషత్తుపై విస్తృతమైన చర్చ జరిగింది. ఎగువసభ శాసన నిర్మాణంలో జాప్యాన్ని కొనసాగిస్తుందని, అప్రజాస్వామికమైందని, అనవసర ఖర్చుతో కూడుకున్నదని, దీన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని రాజ్యాంగ సభ సభ్యుడైన హెచ్.వి.కామత్ పేర్కొన్నారు. చివరికి విధాన పరిషత్తును ఏర్పాటు చేయడం/రద్దుచేయడం అనేది సంబంధిత రాష్ట్ర అభీష్టానికి వదిలి పెట్టాలని రాజ్యాంగ సభ తీర్మానించింది.

విధాన పరిషత్తు ఏర్పాటు/తొలగింపు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 169(1) ఒక రాష్ట్రంలో విధాన పరిషత్తు ఏర్పాటు/తొలగింపు ప్రక్రియ గురించి వివరిస్తుంది. దీని ప్రకారం ఏదైనా రాష్ట్రంలో ఎగువసభ అయిన విధాన పరిషత్తును కొత్తగా ఏర్పాటు చేయాలన్నా లేదా ఉన్న విధాన పరిషత్తును తొలగించాలన్నా ఆ రాష్ట్ర విధాన సభ 2/3వ వంతు ప్రత్యేక మెజారిటీతో తీర్మానం ఆమోదించి పార్లమెంటుకి పంపాలి. పార్లమెంటు సాధారణ మెజారిటీతో ఆ మేరకు చట్టం చేస్తుంది. 'It can't be dissolved but abolished' అని రాజ్యాంగంలో పేర్కొన్నారు.

సభ్యుల అర్హతలు

❐ విధాన పరిషత్తు సభ్యులుగా పోటీ చేసేందుకు ఉండాల్సిన కనీస వయసు - 30 సంవత్సరాలు. ❐ సభ్యుల పదవీ కాలం - 6 సంవత్సరాలు ❐ ప్రతి రెండేళ్లకొకసారి 1/3వ వంతు విధాన పరిషత్తు సభ్యులు పదవీ విరమణ చేస్తారు. ❐ బహుళ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడమే ఈ సభ లక్ష్యం.

నిర్మాణం

విధాన పరిషత్తుకు సభ్యులు అయిదు రకాలుగా ఎన్నికవుతారు.

1) పరిషత్తు మొత్తం సభ్యుల్లో 1/3వ వంతు మంది సభ్యులను రాష్ట్రంలోని స్థానిక సంస్థలైన పురపాలక సంస్థలు, నగరపాలక సంస్థలు, జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు సభ్యులతో కూడిన ఎన్నికల గణం ఎన్నుకుంటుంది.

2) మొత్తం సభ్యుల్లో మరో 1/3వ వంతు మంది సభ్యులను విధానసభ సభ్యులు (ఎమ్మెల్యేలు) ఎన్నుకుంటారు.

3) మొత్తం సభ్యుల్లో 1/12వ వంతు మంది సభ్యులను రాష్ట్రంలో కనీసం మూడేళ్లపాటు నివాసం ఉంటున్న అన్ని విశ్వవిద్యాలయాల పట్టభద్రులతో కూడిన ఎన్నికల గణం ఎన్నుకుంటుంది.

4) మొత్తం సభ్యుల్లో ఇంకో 1/12వ వంతు మంది సభ్యులను రాష్ట్రంలోని సెకండరీ పాఠశాల స్థాయికి తగ్గకుండా కనీసం మూడేళ్లపాటు పనిచేసిన ఉపాధ్యాయులతో కూడిన ఎన్నికల గణం ఎన్నుకుంటుంది.

5) మొత్తం సభ్యుల్లో 1/6వ వంతు మంది సభ్యులను రాష్ట్ర గవర్నర్ నామినేట్ చేస్తారు. ఈ సభ్యులు కళలు, సాహిత్యం, విజ్ఞానం, సామాజిక సేవారంగాల్లో ప్రావీణ్యం ఉన్నవారై ఉంటారు.

విధాన పరిషత్తు సభ్యులు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఏక ఓటు బదిలీ సూత్రం ప్రకారం ఎన్నికవుతారు.

ప్రస్తుతం మన దేశంలో 6 రాష్ట్రాల్లో విధాన పరిషత్తులు ఉన్నాయి. అవి 1) ఉత్తర్‌ప్రదేశ్ (100 మంది సభ్యులు), 2) మహారాష్ట్ర (78), 3) బిహార్ (75), 4) కర్ణాటక (75), 5) ఆంధ్రప్రదేశ్ (58), 6) తెలంగాణ (40).

❐ జమ్ము-కశ్మీర్ విధాన పరిషత్తులో 36 మంది ఎమ్మెల్సీలు ఉండేవారు. జమ్ము-కశ్మీర్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం-2019 ప్రకారం అక్కడి విధాన పరిషత్తును రద్దుచేశారు. ❐ విధాన పరిషత్తు మొత్తం సభ్యుల్లో 5/6వ వంతు సభ్యులు ఎన్నిక ద్వారా ఎన్నికవుతారు. మిగిలిన 1/6వ వంతు సభ్యులను గవర్నర్ నామినేట్ చేస్తారు.



మరిన్ని వివరాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
https://tinyurl.com/5n7h35uz

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విధాన పరిషత్తు ఏర్పాటు, తొలగింపు, పునరుద్ధరణ

❐ 1958, జులై 1న నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తొలిసారిగా విధాన పరిషత్తును ఏర్పాటు చేశారు. అప్పటి విధాన పరిషత్తు ఛైర్మన్ మాడపాటి హనుమంతరావు, డిప్యూటీ ఛైర్మన్ జి.ఎన్.రాజు. ❐ 1985, జూన్ 1న ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విధాన పరిషత్తును రద్దుచేశారు. నాటి విధాన పరిషత్తు ఛైర్మన్ సయ్యద్ ముఖ్‌సిర్‌షా, డిప్యూటీ ఛైర్మన్ ఎ.చక్రపాణి. ❐ 2007, మార్చి 30న వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విధాన పరిషత్తును పునరుద్ధరించారు. అప్పటి సభ ఛైర్మన్ ఎ.చక్రపాణి, డిప్యూటీ ఛైర్మన్ మహ్మద్ జాని.

❐ విభజన అనంతరం కొత్త ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్తుకు తొలి ఛైర్మన్ ఎ.చక్రపాణి, తొలి డిప్యూటీ ఛైర్మన్ ఎస్.వి.సతీష్‌కుమార్ రెడ్డి.

❐ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్తు ఛైర్మన్ కొయ్యె మోషెన్‌రాజు, డిప్యూటీ ఛైర్మన్ మయానా జకియా ఖానమ్. ❐ తెలంగాణ రాష్ట్ర విధాన పరిషత్తుకు తొలి ఛైర్మన్ కె.స్వామిగౌడ్, తొలి డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్. ❐ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర విధాన పరిషత్తు ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ పదవి ఖాళీగా ఉంది.

ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ పదవులు

❐ రాజ్యాంగంలోని ఆర్టికల్ 182 విధాన పరిషత్తు ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ పదవుల గురించి వివరిస్తుంది. సభ్యులు (ఎమ్మెల్సీలు) సభా కార్యకలాపాల నిర్వహణ కోసం తమలో నుంచి ఒకరిని ఛైర్మన్‌గానూ, మరొకరిని డిప్యూటీ ఛైర్మన్‌గానూ ఎన్నుకుంటారు. ❐ ఆర్టికల్ 183 విధాన పరిషత్తు ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్‌లు తమ పదవులను ఏ విధంగా కోల్పోతారనే విషయాన్ని వివరిస్తుంది. శాసనమండలి/విధాన పరిషత్తులో సభ్యత్వం రద్దయినప్పుడు, తమ పదవులకు రాజీనామా చేసినప్పుడు, విధాన పరిషత్తులో తొలగింపు తీర్మానం నెగ్గినప్పుడు పదవులను కోల్పోతారు. ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్‌లను తొలగించే తీర్మానాన్ని 14 రోజుల ముందస్తు నోటీసు ద్వారా తెలియజేయాలి.

❐ ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్‌లలో ఎవరిపై తొలగింపు తీర్మానం ప్రవేశపెడతారో వారు సభా సమావేశాలకు అధ్యక్షత వహించకూడదు. అయితే సభా సమావేశాల్లో పాల్గొనవచ్చు. ఛైర్మన్ తన రాజీనామాను డిప్యూటీ ఛైర్మన్‌కు, డిప్యూటీ ఛైర్మన్, సభ్యులు (ఎమ్మెల్సీలు) తమ రాజీనామాలను ఛైర్మన్‌కు సమర్పించాలి. ❐ ఆర్టికల్ 184 ప్రకారం ఛైర్మన్ పదవి ఖాళీ అయినప్పుడు డిప్యూటీ ఛైర్మన్ సభా సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. ❐ రాజ్యాంగం ప్రకారం విధాన పరిషత్తు సమావేశాలు సంవత్సరానికి తప్పనిసరిగా రెండు సార్లు జరగాలి. రెండు సమావేశాల మధ్య వ్యత్యాసం 6 నెలలు మించకూడదు.

విధాన పరిషత్తు - సమీక్ష

❐ సాధారణ బిల్లులను విధానసభలో లేదా విధాన పరిషత్తులో ప్రవేశపెట్టవచ్చు. ❐ విధాన సభ ఆమోదించి పంపిన సాధారణ బిల్లులను విధాన పరిషత్తు గరిష్ఠంగా 4 నెలలు పాటు నిలిపి ఉంచగలుగుతుంది. ❐ విధాన పరిషత్తును ఒక చేతికి ఉండే 6వ వేలిగా, రాజకీయ నిరుద్యోగులకు ఆశ్రయం కల్పించే సంస్థగా విమర్శకులు పేర్కొన్నారు. ❐ విధాన పరిషత్తు భవితవ్యం విధాన సభ చేసే ప్రత్యేక తీర్మానంపై ఆధారపడి ఉంటుంది. ❐ విధాన సభ ఆమోదించి పంపిన ఆర్థిక బిల్లులను విధాన పరిషత్తు 14 రోజుల్లోగా ఆమోదించాలి. లేకపోతే ఆమోదించినట్లుగానే పరిగణిస్తారు.

రాజ్యసభ, విధాన పరిషత్‌ల మధ్య వ్యత్యాసాలు

❐ రాష్ట్రపతిని ఎన్నుకునే ఎలక్టోరల్ కాలేజీలో రాజ్యసభకు ఎన్నికైన సభ్యులు ఓటర్లుగా ఉంటారు. కానీ రాష్ట్రాల విధాన పరిషత్తు సభ్యులకు (ఎమ్మెల్సీలు) ఎలాంటి ఓటు హక్కు లేదు. ❐ సాధారణ బిల్లుల ఆమోదం విషయంలో రాజ్యసభ, లోక్‌సభల మధ్య అభిప్రాయ భేదాలు వస్తే రాష్ట్రపతి పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేయవచ్చు. కానీ రాష్ట్రస్థాయిలో విధాన పరిషత్తు, విధాన సభల మధ్య అభిప్రాయ భేదాలు వస్తే గవర్నర్ ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం లేదు. ❐ లోక్‌సభ ఆమోదించి పంపిన సాధారణ బిల్లులపై రాజ్యసభ 6 నెలల్లోగా నిర్ణయం ప్రకటించాలి. విధానసభ ఆమోదించి పంపిన సాధారణ బిల్లులపై విధాన పరిషత్తు 3 నెలల్లోగా నిర్ణయాన్ని ప్రకటించాలి. ❐ రాజ్యసభ శాశ్వతసభ. దీన్ని రద్దుచేయడానికి వీలులేదు. విధాన పరిషత్తును పార్లమెంటు చేసే చట్టం ద్వారా రద్దు చేయవచ్చు. ❐ రాజ్యాంగ సవరణ ప్రక్రియలో రాజ్యసభ పాల్గొంటుంది. కానీ విధాన పరిషత్తుకు ఎలాంటి ప్రాతినిధ్యం లేదు.

రచయిత: బంగారు సత్యనారాయణ

మీ ఇంటి బడ్జెట్ సిద్ధమేనా?

ఆదాయం.. ఖర్చు.. ఈ రెండింటి మధ్య సమన్వయం కుదరాలి. నేటి అవసరాలను తీర్చుకుంటూనే భవిష్యత్ వ్యయాలనూ అంచనా వేసుకోవాలి. దేశ బడ్జెట్ లేదా ఇంటి బడ్జెట్ సూత్రం ఇదే. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ రాబోతుంది. ఈ సమయంలో మన కుటుంబానికీ ఒక లెక్కల పద్దు ఉంటే మంచిది కదా.. మరి దీని కోసం ఏం చేయాలో చూద్దాం.

కేంద్ర బడ్జెట్ ప్రభావం ప్రతి పౌరుడిపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉంటుంది. అభివృద్ధి, సంక్షేమం దిశగా అడుగులు వేయాలనే ఒక స్థూల సిద్ధాంతం ఆధారంగా బడ్జెట్‌ను రూపొందిస్తారు. మన ఇంటి పద్దు విషయంలోనూ దీన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

అవగాహనతో..

కుటుంబ బడ్జెట్ తయారు చేసే ముందు మీ ఆర్థిక లక్ష్యాలేమిటి? అవసరాలేమిటి? స్పష్టంగా తెలుసుకోండి. వాటిని ఒక దగ్గర రాయండి. స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలను విడివిడిగా పేర్కొనండి. ఇంట్లోకి కావాల్సిన వస్తువులు కొనడం స్వల్పకాలిక అవసరం. సొంతిల్లు, కారు కొనాలనుకోవడం మధ్య కాలిక లక్ష్యాలు. పదవీ విరమణ, పిల్లల వివాహం దీర్ఘకాలిక వ్యూహాలు. ఒకసారిపై వీటిపై స్పష్టత వస్తేనే మీరు ఏం చేయాలన్న విషయం అర్థం అవుతుంది. చాలామందికి ఆర్థిక ఇబ్బందులు రావడానికి ప్రధాన కారణం.. సంపాదించిన డబ్బును ఎలా సర్దుబాటు చేయాలన్నది తెలియకపోవడమే. లక్ష్యం సూటిగా ఉంటే దానికి ప్రణాళిక వేయడం సులభం. లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు మన దగ్గరున్న ఆర్థిక వనరులను ఎంత సమర్థంగా వినియోగించుకోవాలో తెలుసుకునేందుకు మీ ఇంటి బడ్జెట్ ఉపయోగపడుతుంది.

✦ నెలకు కొంత మొత్తాన్ని తీసి పొదుపు చేస్తే చాలు.. అదే ఆర్థిక ప్రణాళిక అనుకుంటారు చాలామంది. వాస్తవంలో ఇది పొరపాటు. మీరు ఎంత దాస్తున్నారు అని కాకుండా.. మీ లక్ష్యం వాస్తవ రూపంలోకి రావాలంటే ఎంత మదుపు చేయాలి అని తెలుసుకొని, ఆ మొత్తాన్ని పెట్టుబడి పెట్టేలా ప్రణాళిక ఉండాలి.

ముందు చూపుతో..

ఆదాయం, ఖర్చుల వివరాలు రాసుకోవడం ఇప్పటి కోసం కాదు.. మన ఆర్థిక భవిష్యత్తుకు ఇదొక మార్గదర్శిలాగా ఉండాలి. అనుకున్న బడ్జెట్ ప్రకారం వెళ్తున్నామా లేదా ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి. ఏదైనా తేడా ఉంటే ఒకటి, రెండు నెలల్లోనే తెలిసిపోతుంది. ఆదాయాన్ని సరిగ్గానే లెక్క వేసుకున్నారా? ఖర్చుల అంచనా అనుకున్నట్లుగానే ఉందా? ఆదాయం, వ్యయాల మధ్య తేడా ఎంత? ఇలాంటి విషయాలను విశ్లేషించుకోవాలి. దీనివల్ల ప్రణాళిక గాడి తప్పకుండా ఉంటుంది. ఖర్చులు అధికంగా ఉంటే అప్పులు చేయాల్సి వస్తుంది. ఫలితంగా ఆర్థిక లక్ష్యాల సాధన కష్టం కావచ్చు.

చాలామందికి డబ్బు లెక్కలు పెద్దగా పట్టవు. ఆదాయం, ఖర్చులకు లెక్కలు రాయడం ఇష్టం ఉండదు. విలాసాలు, అవసరాలకు మధ్య తేడానూ గుర్తించరు. కోరికల కోసం ఎంత ఖర్చు చేయాలన్నదీ బడ్జెట్‌లో లెక్క వేసుకోండి. అది అవసరాలకు డబ్బు అందకుండా ఇబ్బంది పెట్టకూడదు.

అత్యవసర నిధి ఉందా?

ఎప్పుడు ఏ కష్టం వస్తుందో చెప్పలేం. అందుకే, ప్రతి ఒక్కరి దగ్గరా కొంత అత్యవసర నిధి తప్పనిసరిగా ఉండాలి. మీ కుటుంబ బడ్జెట్‌లో దీనికి అధిక ప్రాధాన్యం ఇవ్వండి. కనీసం 6 నెలల ఖర్చులు, వాయిదాలకు సరిపోయే మొత్తం ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోండి.

లెక్క ఉండాల్సిందే..

మీరు లక్ష్యాలను నిర్ణయించుకున్న తర్వాత చేయాల్సిన పని... మీకు వచ్చే ప్రతి రూపాయినీ లెక్కించడం. ఆదాయం ఎలా వస్తోంది? ఖర్చుల కోసం ఎంత వెళ్తుంది అన్నదానికి కచ్చితమైన లెక్క ఉండాలి. మీకు వచ్చే వేతనం, ఇతర ఆదాయాలు, వడ్డీ, పెట్టుబడులపై రాబడి ఇలా అన్ని ఆదాయాలనూ కలపండి. ఏడాదికి ఎంత ఆదాయం వస్తుందనేది అంచనా వేయండి. నెలవారీ ఖర్చు ఎంత అవుతోంది.. మూడు, ఆరు నెలలకోసారి, ఏడాదికోసారి వచ్చే పెద్ద ఖర్చులు, శుభకార్యాలు ఇలా అన్నింటికీ తగిన కేటాయింపులు ఉండాలి. ఇలాంటి ఖర్చులకూ నెలకు కొంత మొత్తాన్ని తీసి, రికరింగ్ డిపాజిట్లలాంటి వాటిలో జమ చేయాలి.

✦ కుటుంబ సభ్యులు చేసే ప్రతి ఖర్చునూ లెక్క రాయాలి. వాటిని ప్రతి రెండు నెలకోసారి సమీక్షించుకోవాలి. ఖర్చుల నియంత్రణ సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలి.

✦ స్థిరమైన ఆదాయం లేని వారు ఆదాయం, ఖర్చుల కోసం రెండు వేర్వేరు ఖాతాలు నిర్వహించాలి. ఆదాయాలన్నీ ఒక చోట జమ చేసి, ఆ తర్వాత ఖర్చుల ఖాతాలోకి కొంత మొత్తం మళ్లించాలి.

వచ్చే ఏడాది ఎన్నికల నేపథ్యంలో ఈసారి బడ్జెట్‌పై సాధారణ ప్రజల ఆశలు అధికంగానే ఉన్నాయి. ముఖ్యంగా గత మూడేళ్లుగా కరోనా కష్టాలను ఎదుర్కొన్న ప్రజలకు ఆదాయపు పన్ను విషయంలో ఎలాంటి హామీలు లభిస్తాయో అని వేతన జీవులు ఎదురుచూస్తున్నారు. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తమకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇస్తారోనని ఆశపడుతున్నారు.

సిరి

బడ్జెట్ 2023

ఈసారైనా కరుణ చూపండి

ఆదాయపు పన్ను పరిమితి విషయంలో కొన్నేళ్లుగా ఆశించినంత ఊరట లభించడం లేదు. పన్ను వర్తించే ఆదాయం పరిమితి రూ.5లక్షల మేరకు ఉన్నా, ఇది కొన్ని నిబంధనల మేరకే అనుమతిస్తారు. అలా కాకుండా రూ.5 లక్షల వరకూ ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలని అందరూ కోరుకుంటున్నారు.



పన్ను వర్తించే ఆదాయం రూ.10లక్షలు ఉన్న వ్యక్తి 2013-14లో రూ.1,33,900 పన్ను చెల్లించాల్సి వచ్చేది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పన్ను మొత్తం రూ.1,17,000. అప్పటితో ఇప్పటి ధరల ద్రవ్యోల్బణ సూచీని పోల్చి సర్దుబాటు చేస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన పన్ను రూ.88,997 ఉండాలి. అంటే రూ.28,003 తక్కువగా ఉండాలి. అంటే, పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగానైనా పన్నుల పరిమితి పెంచాల్సిన అవసరం ఉంది.

➔ శ్లాబులనూ సవరించాలి..

ఆదాయపు పన్ను పరిమితి పెంచడంతో పాటు, పాత పన్నుల విధానంలో 20, 30 శాతం శ్లాబులనూ పెంచాల్సిన అవసరం ఉంది. రూ.10లక్షల పైన 20 శాతం, రూ.15 లక్షలపైన 30 శాతం శ్లాబుతో పన్ను విధించాల్సిన అవసరం ఉంది. అప్పుడే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పన్ను చెల్లింపుదారులకు మిగులు మొత్తం పెరుగుతుంది.

➔ రూ.2లక్షలు చేస్తారా?

పన్ను భారం తగ్గించుకునేందుకు ఉన్న ప్రధాన సెక్షన్ 80 సి. ఇందులో భాగంగా రూ.1,50,000 వరకూ వివిధ పథకాల్లో మదుపు చేసే అవకాశం కల్పిస్తున్నారు. ఈపీఎఫ్, వీపీఎఫ్, పీపీఎఫ్, జీవిత బీమా, ఇంటి రుణం అసలు, ఈఎల్ఎస్ఎస్‌లు, పన్ను ఆదా ఎఫ్‌డీలు, పిల్లల ట్యూషన్ ఫీజులు ఇలా ఎన్నో ఇందులో భాగంగానే ఉన్నాయి. 2014 నుంచి దీన్ని మార్చింది లేదు. అప్పటి నుంచీ ఇప్పటికీ ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రజల కొనుగోలు శక్తి లోనూ 25శాతం మేరకు వృద్ధి ఉందని నివేదికలు చెబుతున్నాయి. ద్రవ్యోల్బణమూ అధికంగానే ఉంది. 2014 లెక్కల్లో చూస్తే రూ.1.50లక్షలు సరిపోయింది. కానీ, ఇప్పుడు కనీసం రూ.2 లక్షల వరకూ మినహాయింపుల పరిమితి పెంచితే బాగుంటుంది. సెక్షన్ 80సీసీడీ (1బీ) పరిమితినీ రూ.లక్షకు పెంచాలి.

➔ కొన్ని ప్రత్యేకంగా..

టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీల అవసరాన్ని ప్రజలు గుర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిని మరింత ప్రోత్సహించేందుకు ఈ పాలసీలకు ప్రత్యేక సెక్షన్ కల్పించాల్సిన అవసరం ఉంది. ఇంటి రుణం అసలు, వడ్డీ మొత్తానికి రెండు వేర్వేరు సెక్షన్లు ఉన్నాయి. ఆర్‌బీఐ రెపో రేటును 225 బేసిస్ పాయింట్ల మేరకు పెంచింది. దీంతో గృహరుణాలు ఖరీదయ్యాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని, అసలు, వడ్డీ చెల్లింపులకోసం ఒకే సెక్షన్ ఏర్పాటు చేసి, రూ.5లక్షల వరకూ ఇందులో మినహాయింపు అవకాశాన్ని కల్పించాలి. దీనివల్ల సొంతింటి కలను నెరవేర్చుకోవాలనుకునే వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

➔ ప్రీమియంపై జీఎస్‌టీ..

ఆరోగ్య బీమా, టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలపై జీఎస్‌టీని తగ్గించాలని పాలసీదారులతోపాటు, పరిశ్రమా కోరుకుంటోంది. 18 శాతం నుంచి 5 శాతం పరిధిలోకి తీసుకురావాలని కోరుకుంటున్నారు.

- అధిల్ శెట్టి, సీఈఓ, బ్యాంక్‌బజార్

ఈక్విటీలు.. రుణ పత్రాల్లో

వైట్‌ఓక్ క్యాపిటల్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్

వైట్‌ఓక్ క్యాపిటల్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఒక బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌ను తీసుకొచ్చింది. వైట్‌ఓక్ క్యాపిటల్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ అనే ఈ పథకం న్యూ ఫండ్ ఆఫర్ ముగింపు తేదీ వచ్చే నెల 3. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.500 పెట్టుబడి పెట్టాలి. ఇది ఓపెన్ ఎండెడ్, డైనమిక్ అసెట్ అలకేషన్ తరగతికి చెందిన పథకం. అంటే 65 శాతానికిపైగా పెట్టుబడులను ఈక్విటీ షేర్లకు కేటాయిస్తారు. మిగిలిన సొమ్ము రుణ పత్రాల్లో ఉంటుంది. తద్వారా అటు పెట్టుబడుల వృద్ధి, ఇటు కొంత వడ్డీ ఆదాయం లభిస్తుందన్నమాట. తక్కువ నష్టభయంతో స్థిరమైన ఆదాయాలు నమోదు చేసే అవకాశం ఇలాంటి పథకాలకు ఉంటుంది. ఈ పథకానికి ఫండ్ మేనేజర్లు రమేష్ మంత్రి, తృప్తి అగ్రవాల్, పియూష్ బరన్వాల్. క్రిసిల్ హైబ్రీడ్ 50+ 50 మోడరేట్ ఇండెక్స్‌ను ఈ ఫండ్ పనితీరుకు కొలమానంగా తీసుకుంటారు.

బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లు దేశీయ మ్యూచువల్ ఫండ్ల మార్కెట్లో ఎంతో ఆదరణ కల విభాగం కావటం గమనార్హం. గత ఏడాది కాలంలో బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లలోకి దాదాపు రూ.11,600 కోట్ల పెట్టుబడి లభించింది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఎడెల్‌వైజ్, బీఎన్‌పీ పారిబస్... తదితర అగ్రశ్రేణి మ్యూచువల్ ఫండ్ సంస్థలు బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ పథకాలను నిర్వహిస్తున్నాయి. ఈ విభాగంలోకి వైట్‌ఓక్ క్యాపిటల్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా అడుగుపెట్టింది. సాధారణంగా ఇటువంటి పథకాల్లో కనీసం అయిదేళ్ల పాటు తమ పెట్టుబడులను కొనసాగిస్తేనే తగిన ప్రతిఫలం లభిస్తుంది. ఇతర ఈక్విటీ పథకాలతో పోలిస్తే నష్టభయం తక్కువ. అధిక లాభాలూ రాకపోవచ్చు.

స్థిరమైన వడ్డీ కోసం

డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడి పెట్టే **డీఎస్‌పీ నిఫ్టీ ఎస్‌డీఎల్ ప్లస్ జీ-సెక్ 2027 50: 50 ఇండెక్స్ ఫండ్‌**ను తీసుకొచ్చింది. సమీకరించిన నిధులను కేంద్ర ప్రభుత్వం జారీ చేసే సెక్యూరిటీలు, రాష్ట్ర ప్రభుత్వాల రుణ పత్రాల్లో మదుపు చేస్తారు. 2027 సెప్టెంబరు నాటికి కాలవ్యవధి తీరే పత్రాలను ఎంచుకుంటారు. ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ వచ్చే నెల 8. కనీస పెట్టుబడి రూ.500. ఈ పథకంలో పెద్దగా నష్టభయం ఉండదు. స్థిరమైన వడ్డీ ఆదాయం లభిస్తుంది.